

హైదరాబాద్ వార్త



# మరోసారి వరుణుడి ప్రతాపం

## జలమయమైన రోడ్లు

### నగరాన్ని ముంచెత్తిన వాన ● స్తంభించిన జనజీవనం



హైదరాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త : కొన్ని రోజులుగా నగరాన్ని వరుణుడు వదలట్లేదు. సోమవారం మరోసారి తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం నుంచి అక్కడక్కడ చిన్నపాటి చినుకులు పడుతూ మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షంగా మారింది. దీంతో నగరంలోని పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపుల శబ్దం లేకుండా ఉధృతం గా పడడంతో భాగ్యనగరం మరోసారి చిగురుటాకులా వణికిపోయింది. క్షణక్షణం తీవ్రతను పెంచుకుని జడివానగా మారడంతో రోడ్లపై వెళ్తున్న వాహనదారులతోపాటు ఇళ్లలోని ప్రజలు హడలిపోయారు. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు చెరువుల్లా మారిపోయాయి. వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా జిహెచ్ఎంసి సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్ల మీద వర్షపు నీళ్లు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతుంటూ జిహెచ్ఎంసి సిబ్బంది ఏమాత్రం పట్టించుకో లేదని పలువురు పేర్కొంటున్నారు. వాన కొనసాగుతూనే ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా ఇబ్బంది ఎదురైంది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నారు. వద్దంటే వానలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు, బస్తీలు తరచూ జలమయమౌతున్నాయి. ఎటు వైపు చూసినా చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అనేక చోట్ల రహదారులు జలమయమయ్యాయి. రోడ్లు బాగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోఠి, బేగంబజార్, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హైదర్‌గూడ, నారాయణగూడ, లక్డీకాపూల్, ఆర్టీస్ క్రాస్‌రోడ్, ముషీరాబాగ్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, రామ్‌నగర్, దోమలగూడ, బోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్, జవహర్‌నగర్, అమీర్‌పేట్, మైత్రివనం, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాగల మూడు రోజులు కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది.



కనిపించని ఎంఆర్‌పి.. ప్రతి వస్తువుపై విక్రయించే ధరతో పాటు ఎప్పుడు ప్యాకింగ్ చేశారో నిబంధనల ప్రకారం ముద్రించాలి. అయితే బియ్యం బస్తాలపై ఎటువంటివి వివరాలు కనిపించడంలేదు. బియ్యం బస్తా కొనుగోలు చేసిన వినియోగదారులకు బిల్లు కూడా ఎక్కడా ఇవ్వడంలేదనే విమర్శలున్నాయి. నగరంలో వేలల్లో బియ్యం వ్యాపారులు ఉన్నారు. వీరితో పాటు ప్రధానంగా కొందరు బడా వ్యాపారులు బియ్యాన్ని నిల్వచేస్తూ ధరలు పెంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

## రేషన్ బియ్యంతో..



# సన్న బియ్యం



**ఆకర్షణీయమైన ప్యాక్‌లతో వినియోగదారులకు వల**

**రేషన్ బియ్యాన్ని పాలిష్‌చేసి మిక్స్‌చేస్తున్న వ్యాపారులు**

**కల్తీచేసిన బియ్యం అధిక ధరలకు అమ్మకాలు**

**పట్టించుకోని సంబంధిత అధికారులు**

హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త: మెరిసేవన్నీ బంగారం కావు.. అలాగే రంగురంగుల ఆకర్షనీయమైన సంచుల్లో ఉన్నబియ్యం నాణ్యమైనదనుకుంటే పొరపాటే.. వినియోగదారుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు ఆకట్టుకునే బ్యాగుల్లో నాసిరకం బియ్యాన్ని నింపి విక్రయిస్తున్నారు. గ్రేటర్‌లో కొందరు బియ్యం వ్యాపారుల మాయాజాలానికి ఇదో నిదర్శనం. దూర ప్రాంతాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలంటే ఒకవైపు అధిక ధర, మరోవైపు రవాణా చార్జీలు ఎక్కువవుతోందని భావించిన అక్రమార్కులు.. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి శివారు జిల్లాల్లోని మిల్లుల్లో వాటిని పాలిష్ చేసి ప్రముఖ కంపెనీల పేరిట నంబర్‌వన్ ముద్రతో ప్యాక్ చేసి వినియోగదారులకు అంటగడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలోని వనస్థలిపురంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి రాజేష్ రైతుబజార్ సమీపంలోని ఓ బియ్యం దుకాణంలో రూ.1250 వెచ్చించి కర్నూలు నెంబర్ బియ్యం బస్తాను కొనుగోలు చేశాడు. అధిక రేటు వెచ్చించి కొన్న బియ్యాన్ని ఇంటికి వెళ్లి వండితే మెతుకులన్నీ బొద్దుగా కనిపించడం, నోటికి రుచి అందకపోవడంతో నాసీరకం బియ్యాన్ని తనకు అంటగట్టాడని గ్రహించాడు. మరుసటి రోజు ఉదయం వ్యాపారి దగ్గరికి బియ్యాన్ని తీసుకెళ్లి వాపస్ తీసుకోమని చెప్పగా నిరాకరించాడు. చేసేదేమీలేక వచ్చినదారినే వెనుదిరిగాడు. కాగా ఉద్యోగి రెండు విధాలుగా నష్టపోయాడు.. రేటు విషయం ఒకటైతే.. నకిలీ విషయంలో మరో విధంగా నష్టపోయాడు. ఇది ఈఒక్క ఉద్యోగికి సంబంధించిన విషయం కాదు. నిత్యం నగర వ్యాప్తంగా వ్యాపారుల చేతుల్లో నష్టపోతున్న వేలాదిమంది ప్రజల విషయం. నెంబర్ వన్ క్వాలిటీ బియ్యం పేరుతో వ్యాపారులు ప్రజలను మోసపుచ్చుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి కొన్న ఫలితం లేకుండా పోతుండటంతో విక్రయదారులు నష్టపోతున్నారు. నంబర్‌వన్ క్వాలిటీ పేరుతో నకిలీ బియ్యాన్ని ప్రజలకు అంటగడుతూ వ్యాపారులూ, డీలర్లు, ఏజెంట్‌లు లక్షలు సొమ్ముచేసుకుంటున్నారు. రాష్ట్రంలో అత్యంత నాణ్యతతో బియ్యాన్ని తయారు చేసే కంపెనీలు పలు బ్రాండెడ్ ముద్రలు వేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న విషయం అందిరికీ తెలిసిందే. అయితే ఆకంపెనీల బ్రాండెడ్‌ను కొందరు వ్యాపారులు వాడుకొని ఆదే పోలికతో కూడిన బస్తాలను తయారు చేయించి అందులో నాసీరకం బియ్యం నింపి ప్రజలను మోసపుచ్చుతున్నారు.

**బ్రాండెడ్ బస్తాల్లో నాసీరకం మిక్సింగ్..** నగరంలో నాణ్యమైన ఖాళీ బస్తాలను ఒక్కొక్కటి రూ.15 నుండి రూ.20 చొప్పున కొనుగోలు చేసి వాటిపై బ్రాండెడ్ కంపెనీల పేర్లు ముద్రిస్తున్నారు. ఇలాంటి బస్తాల్లో నాసిరకం బియ్యం నింపి 25కిలోల బస్తా రూ.1200 నుండి రూ.1500, 50కిలోల బస్తాను రూ.2500 నుండి రూ. 3000 వరకు విక్రయిస్తున్నారు. బస్తాలపై బ్రాండెడ్ కంపెనీల పేర్లు ముద్రించి ఉండటం వల్ల బియ్యాన్ని పరిశీలించకుండానే వినియోగదారులు కొనుగోలు చేసి దారుణంగా మోసపోతున్నారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రైస్‌మిల్లులోనే ఈ తరహా బస్తాల మార్పిడి జరుగుతున్నట్లు సమాచారం. మార్కెట్‌లో దొరికే సాధారణ బియ్యాన్నే దట్టంగా పాలిష్ చేసి నెంబర్‌వన్ అనే ముద్రవున్న బస్తాల్లో నింపి విక్రయిస్తున్నారు. ఫలితంగా దళారులు రూ.400నుండి 500 వరకు కమీషన్ రూపంలో దండుకుంటున్నారు. అంటే ఆ బస్తాలోని సగం బియ్యం కల్తీవే అన్నమాట. కాగా నాలుగైదు బ్రాండెడ్ కంపెనీలున్న వాటన్నింటిలో సాధారణ బియ్యాన్ని నింపడం వల్ల నాణ్యమైన బియ్యాన్ని వినియోగదారుడు గుర్తించలేకపోతున్నారు. అంతేకాకుండా ఈదళారులు రేషన్‌బియ్యం అధిక రేటుకు కొనగోలు చేసి రీసైక్లింగ్ చేస్తున్నారు.

# యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

**పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు**

**అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..**

**నాలాను కబ్జా చేసిన మరో అక్రమార్కుడు**

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. తాజాగా జీడిమెట్ల డివిజన్ పరిధి గణేష్‌నగర్ హౌసింగ్ సొసైటీలో ఓ వ్యక్తి నాలాను ఆనుకొని ఉన్న సుమారు 40గజాల స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్రకు వెళ్లే రహదారికి పక్కనే ఉన్న జీన్స్ ఫ్యాక్టరీ వద్ద ఓ బహుళ అంతస్తుల నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో 6 కమర్షియల్ షెటర్ల నిర్మాణం చేపట్టాడు. పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని అపార్ట్‌మెంట్ వాసులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**మామూళ్ళ మత్తులో టౌన్‌ప్లానింగ్ విభాగం..** అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు వారితోనే కుమ్మక్కై భూ కబ్జాలకు, అక్రమ నిర్మాణాలకు వంత పాడుతున్నారని స్థానికుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలు నిజం చేసే విధంగా జీడిమెట్ల డివిజన్ గణేష్ హౌసింగ్ సొసైటీలో నాలాను కబ్జా చేస్తూ సుమారు 40 గజాల్లో నిర్మాణాలు, అపార్ట్‌మెంట పార్కింగ్‌కై కేటాయించిన 6గజాల స్థలంలో 6 షెటర్ల నిర్మాణం చేపడుతున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం, అధికారులు పట్టించుకోకపోవడమే నిదర్శనమంటున్నారు స్థానికులు. అంతేకాకుండా అక్రమార్కులకు అధికారులతో పాటు ప్రజా ప్రతినిధుల అండదండలు కూడా లేకపోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులకు పదే పదే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా నోటీసులతో కాలాయాపన చేస్తున్నారే తప్పా చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నోటీలు ఇచ్చి చర్యలు తీసుకుంటాం**
**డిప్యూటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబయ్య.**

జీడిమెట్ల డివిజన్ గణేష్ హౌసింగ్ సొసైటీ, జీన్స్ ఫ్యాక్టరీ సమీపంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ఆరోపణలు వస్తున్న స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారో లేదో అనే విషయంపై పరిశీలిస్తాం. అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని మా దృష్టికి వస్తే ఖచ్చితంగా నోటీలసులు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటాం.

## నాటక రచయితలకు రసరంజని ఉచిత శిక్షణా శిబిరం

**తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్**

నాంపల్లి, అక్టోబరు 10 ప్రభాతవార్త : నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో 'నాటకం వ్రాయడం ఎలా?' శీర్షికన 5రోజులపాటు ఉచిత శిక్షణా శిబిరాన్ని ఈ నెల 27 గురువారం నుండి 31 సోమవారం వరకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ పేర్కొన్నారు. రచయితల అభ్యర్థన మేరకు దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీని ఈ నెల 15 శనివారం పొడిగించినట్లు భట్టురమేష్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన నాటకరంగంపై ఆసక్తిగల 21-35 మధ్య వయస్కులైన ఇంటర్మీ డియట్ వరకు చదివిన యువ రచయితల కొరకు నిర్వహించే పూర్తిగా ఉచితమైన ఈ శిబిరంలో పాల్గొనే వారికి వసతి, భోజన సౌకర్యాన్నీ ఉచితంగా రసరంజని కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# లక్కీడ్రా పేరుతో జనాల్ని మోసం చేస్తున్న వ్యక్తుల అరెస్టు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త : ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్ లక్కీ ఫంక్షన్ హాల్లో లక్కీ డ్రా పేరుతో జనాల్ని మోసం చేస్తున్న వ్యక్తులను వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా లక్కీ డ్రాను నిర్వహిస్తున్న మహ్మద్ షాకిర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర సుమారుగా 800 కాయిన్స్‌ను దానికి సంబంధించిన యంత్రాంగాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రతి నెల పదో తేదీన డ్రా ఉంటుందని ప్రజలందరినీ పలిపించి ఒకొక్క పేరుతో నెంబర్ కాయిన్స్‌తో డ్రా చేశారని ఎస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## యోగాతో మానసిక ఆరోగ్యం

**ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్**
**జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్**



యోగా గురువులను సత్కరిస్తున్న హిప్నో పద్మా కమలాకర్

ధర్నాచౌక్, అక్టోబర్ 10, ప్రభాతవార్త: యోగాతో మానసిక ఆరోగ్యం బాగుంటుందని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇందిరాపార్కులోలో మానసిక సమస్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేసించి ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యవంతమైన మనసు ఉంటుందని అన్నారు. బాహ్య పరిశుభ్రతతో పాటు మనసులోని క్లేశాలను తొలగించుకుని మనోశుభ్రతను పాలించాలని సూచించారు. యోగా అనేది మనసుకు వ్యాక్యూమ్ క్లీనర్ లాంటిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువలైన బొబ్బిలి సరోజిని, బి.రామారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్ణ, గీత, ధనలక్ష్మి, హిత, అడ్వకేట్ రాజేంద్రకుమార్, ప్రకాష్ సింగ్, వెంకటేశ్వరరావు, ఇందిరాపార్కు యోగా సెంటర్ సాధకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం ముందు వరసలో సికింద్రాబాద్

**డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**



లబ్దిదారులకు పెన్షన్ల గుర్తింపు కార్డులను పంపిణి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, అక్టోబర్ 10 ప్రభాత వార్త: అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల అమలులో సికింద్రాబాద్ నియోజక వర్గం ముందు వరసలో ఉందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. తార్నాక డివిజన్ లాలాపేట్ ప్రొ.జయశంకర్ స్టేడియంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి పించన్ల గుర్తింపు కార్డులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ నియోజక వర్గంలో సుమారు 16వేల మందికి ఆసరా పెంచన్లు అందజేయడం జరిగిందన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చూస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను చేపడుతు న్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, తహసిల్దార్ మాధవి, తెరాస నాయకులు కిషోర్ కుమార్ గౌడ్, కిరణ్‌కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సునిల్‌ముదిరాజ్, నాగేశ్వర్‌రావుగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, క్రిష్ణస్వామి, స్మిత కోటేష్, అమర్ బన్సోడ్, మల్కరి పద్మ, వనజ, విజయతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తొలి హోంమంత్రి నాయినికి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి

చిక్కడపల్లి, అక్టోబరు 10 ప్రభాతవార్త: పీడిత ప్రజల కోసం అమర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి, తెలంగాణ తొలి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిఅని టిఆర్ఎస్ రాష్ట్రనేత, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ పూర్వ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతినగర్‌లో టిఆర్ఎస్ నాయకురాలు సరస్వతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిఎస్ఆర్ పాల్గొన్నారు. సీనియర్ టిఆర్ఎస్ నేతలు గోపి, శివ, మెరుగు శ్రీని వాస్‌యా దవ్, బలామణి తదితరులు పాల్గొ న్నారు.

## దీపావళికి గవర్నర్‌కు ఆహ్వానం



రాష్ట్ర గవర్నర్ డాక్టర్.తమిళిసై సౌందర్ రాజన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ

చార్మినార్, అక్టోబరు 10 ప్రభాతవార్త : రాష్ట్ర గవర్నర్ డాక్టర్.తమిళిసై సౌందర్ రాజన్‌ను సోమవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళతో పాటు మందిరం కమిటి ప్రతినిధులు కలిశారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో ఈ నెల 24వ తేదీన జరగనున్న దీపావళీ మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ డాక్టర్. తమిళిసై సౌందర్ రాజన్‌కు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

### బస్సు అదుపుతప్పి వెనుకవైపు

## ఢీకొట్టడంతో కారులో మంటలు



అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 10 ప్రభాత వార్త : విజయవాడనుండి హైదరాబాద్‌కు అర్వపల్లి లక్ష్మినరసింహాం తన కుటుంబ సభ్యులతో కలిసి కారు టిఎస్ 07 జిఎక్స్ 5897 వస్తుండగా మార్గమధ్యంలో ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోకి రాగానే తెల్లవారుజామున సమయం సుమారు 3 గంటలకు తన కారు ముందు వెళ్తున్న ఒక గుర్తు తెలియని బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆ సమయంలో అతను గమనించి తన కారును నియంత్రించడానికి ప్రయత్నించాడు, కానీ తన కారు అదుపుతప్పి బస్సు వెనుకవైపున ఢీకొట్టింది. ప్రమాదవశాత్తు కారు ముందు బాగం నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే లక్ష్మి నరసింహాం తన కుటుంబ సభ్యులతో కలిసి కారు దిగి దూరంగా వెళ్లిపోయాడు. అతని కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఈ విషయంపై అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ లక్ష్మి నరసింహం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

## దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే 'దళితబంధు' పథకం

చిక్కడపల్లి, అక్టోబరు 10 ప్రభాతవార్త: దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే 'దళితబంధు' పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో అరుంధతినగర్ బస్తీకి చెందిన సరస్వతికి 'దళితబంధు' కింద మంజూరైన వాహనాన్ని అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజయసింహా, మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, గాంధీనగర్ టిఆర్ఎస్‌అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్, నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గుండు జగదీశ్, రవిశంకర్‌గుప్త, హనుమంతు, శ్రీకాంత్, బబిఎన్.రమేశ్‌కుమార్, రేణుక, బాలామణి, పద్మ, కుమారి, రత్నయ్య, రాజ్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోందని.. లబ్దిదారులు సంతోషంగా ఉన్నారని అన్నారు.

# అందెశ్రీకి 'సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం

చిక్కడపల్లి, అక్టోబరు 10 ప్రభాతవార్త: సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 15న నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయ కవి డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ వివరించారు. ఈ జాతీయ పురస్కారాన్ని లోకకవి డాక్టర్ అందెశ్రీకి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సాయంత్రం జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ డి.రవీందర్, ప్రజానటులు ఆర్.నారాయణమూర్తి చేతులమీదుగా అందించడం జరుగుతుందన్నారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ కవులు రామోజు హరగోపాల్, డాక్టర్ బెల్లి యాదయ్య, హైకోర్టు న్యాయవాది ఎం.విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. స్వాగతగీతాన్ని రచ్చ భారతి ఆలపిస్తారని, కార్యక్రమానికి ముందు తెలుగుపాటల కోయిల భూదేవి, లోకల్‌బాబు రమణ బృందంచే దేశక్తిగీతాలాపన ఉంటుందన్నారు.

## పథకంకు దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 10, ప్రభాతవార్త : ట్రైకాన్, గిరిజన సంక్షేమ శాఖ తెలంగాణ ప్రభుత్వం సిఎం ఎస్‌టి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ పథకం కింద ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) హైదరాబాద్ 2022-2023ఆర్థిక సంవత్సరంలో సామర్థ్యాల పెంపుదల, శిక్షణ, పరిశ్రమల వ్యాపారాల ఏర్పాటుకు ట్రైకార్ ద్వారా ఆర్థిక సహాయం అందించుట కొరకు ఆసక్తి, అర్హత కలిగిన గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి ఆన్‌లైన్‌ద్వారా ధరఖాస్తులు కోరుతున్నట్లు మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

# బిజెపితోనే దేశం అభివృద్ధి

**కంటోన్మెంట్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి నరేంద్రమోడి దేశాభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, బిజెపి విధి విధానాలకు ఆకర్షితులమై బిజెపి పార్టీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరడం జరిగిందని గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకుడు, ప్రముఖ వ్యాపార వేత్త మద్దెర్ల శ్యామ్‌సుందర్ తెలిపారు. ఆదివారం రాత్రి నర్సాపూర్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభకు మహేంద్రహిల్స్ నుంచి సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ నుంచి వందలాది మంది కార్యకర్తలతో ఊరేగింపుగా తరలివెళ్లి బిజెపి పార్టీలో చేరారు. తాను బిజెపి పార్టీలో చేరినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావ్‌లు సంతోషంగా పార్టీలో చేర్చుకోవడం అభినందనీయమన్నారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో మరింత పటిష్టం చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.



బిజెపీలో చేరిన శ్యామ్ సుందర్

# డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి : కొంతం దీపిక

**కంటోన్మెంట్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని నాలా బజార్, కుమ్మరిగూడ, ఆర్‌పి, రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ రవిందర్, శానిటేషన్ విభాగం సిబ్బంది, బిజెపి నాయకులు కొంతం నరేశ్, వీరవర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కొంతం దీపిక

# ఖైరతాబాద్ బడా గణేష్ చైర్మన్ సుదర్శన్‌కు ఘన నివాళులు

**ఖైరతాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని నగరంలో కొలువుదీరేటటువంటి బడా గణేష్ చైర్మన్ సింగరి సుదర్శన్‌ను ప్రముఖ రాజకీయ నాయకులు, సేవా సంస్థల వారు, అభిమాన ప్రజానీకం దివంగతులైన ఆయనకు పూల, పుష్పగుచ్చాలతో అంజలి ఘటించారు. దివంగత సుదర్శన్ కుటుంబసభ్యులు లైబ్రరీ సమీపంలోని ఐమాక్స్ థియుటర్ పక్కన ఉన్న ఖాళి స్థలం అయిన ప్రాంతంలో వేలాదిగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ఆయనకు అంజలి ఘటించడంతోపాటు సుదర్శన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఖైరతాబాద్ గణేష్ అంటూ పేరుగావించిన వ్యక్తి ఆయనని ఇటీవల చివరిసారిగా గణేష్ నిమజ్జనోత్సవంలో ఖైరతాబాద్ మహాగణపతిని తనివితీరా చూసిన ప్రధానకర్త ఇక లేకపోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని విచ్చేసిన కొందరు పాత జ్ఞాపకాలను స్మరిస్తూ సూచిస్తున్నారు. ఆయన సోదరుడు దివంగతులైన సింగరి శంకరయ్య మొదటగా గణేష్ విగ్రహాన్ని కొనసాగించే వారని ఆయన మృతి అనంతరం ఆయన సోదరుడైన సుదర్శన్ ప్రతియేటా ఎత్తును పెంచుతూ ఖైరతాబాద్ వినాయకుడిగా రాష్ట్ర తదితర ప్రాంతాల, జిల్లాల వారీగా పేరు గడించే విధంగా మహాగణపతిని కొలువుదీరింపచేసి చివరికి 68 సంవత్సరాల వరకు యధేచ్ఛగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోగలిగి అందరిమన్ననలు పొందేవారని పలువురు గుర్తుచేస్తున్నారు. సరిగ్గా ఒకటవ తేదీన స్వర్గస్థులైన సుదర్శన్ సోమవారం పదవ రోజు కావడంతో ఆయన కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో అభిమానంగా పాల్గొన్నారు.

# సాహితీ రంగంలో ధృవతారగా వెలుగుతున్న కొలకలూరి

**సైఫాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** ఆరున్నర దశాబ్దాలుగా సాహితీ రంగంలో ధృవతారగా వెలుగుతున్న అసాధారణ ప్రతిభాశాలి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కొనియాడారు. ప్రముఖ అక్రుతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో సుప్రసిద్ధ రచయిత, సంఘ సంస్కర్త, నాటకకర్త గురజాడ అప్పారావు పేరిట ఏర్పాటు చేసిన 'అకృతి-గురజాడ' పురస్కారాన్ని ఇనాక్‌కు మంత్రి ప్రదానం చేసి మాట్లాడారు. ఒక విశ్వవిద్యాలయం కులపతిగా ఎపి సాహిత్య అకాడమీ చైర్మన్‌గా పనిచేసిన ఇనాక్ సాహితీ సేద్యం కొనసాగించడం అద్భుతమన్నారు. ఇనాక్ గురజాడలాగా అనేక సాహిత్య ప్రక్రియల్లో అభినివేశం ఉండటం ఆయనకు గురజాడ సాహితీ పురస్కారం అందజేయడం సమంజసమన్నారు. ఇనాక్‌కు 84 ఏళ్ళు ఉన్నప్పటికి 48 ఏళ్ళుగా కనిపిస్తూ సాహిత్య సేవ అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, అక్రుతి సుధాకర్ హైదరాబాద్ ఫిక్కి సిఎండి అచ్యుత జగదీష్‌చంద్ర పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**సికింద్రాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని హైద్రాబాద్ జిల్లా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు ఈ. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిపిన ఆందోళన కార్యాక్రమంలో సికింద్రాబాద్ విలేకరులు పెద్దయెత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాటంలోనే కాకుండా అనేక సందర్బాలలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు జర్నలిస్టులకు సొంతింటి కల నెరవేర్చుతానని హామీలు ఇచ్చారన్నారు. తెలంగాణ వచ్చి ఎనిమిదేళ్ల పూర్తయినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యాక్రమంలో బత్తుల నర్సింగ్‌రావు, వీజే, శేషగిరిరావు, రాజేందర్, మద్దెర్ల కిరణ్ ఇతర విలేకరులు పాల్గొన్నారు.

# పేదలకు గొడుగులు పంపిణీ

**కంటోన్మెంట్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** పేదలు ఎండలకు, వానలకు ఇబ్బంది పడకుండా వారికి ఉపసమనం కలిగేందుకు గొడుగులు పంపిణీ చేస్తున్నామని శ్రీగణేష్ పౌండేషన్ వ్యవస్థాప కులు, టిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమ వారం మానవతా దృక్పదంతో పుట్‌పా త్‌లపై జీవనం కొనసాగిస్తున్న యాచకులకు తిరుమ లగిరి సూర్య భగవాన్ ఆలయ సమీపంలో జీవ నం కొనసాగిస్తున్న యాచకులకు శ్రీగణేష్ గొడుగులను ఉచితంగా అందజేశారు.



గొడుగులు అందజేస్తున్న శ్రీగణేష్

# మంచిరేవుల కౌన్సిలర్ కొడుకుపై హత్యాయత్నం?

## - నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

**నార్సింగి, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవుల కౌన్సిలర్ కుమారుడిపై హత్యాయత్నం జరిగిందంటూ ఓ వార్త సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేస్తుంది. ఈ విషయంపై నార్సింగి ఎస్.ఐ బాల్‌రాజ్‌ను వివరణ అడిగితే ఆ వివరాలు మీడియాకు చెప్పలేమని ఫోన్ కట్ చేశారు. మంచిరేవుల కౌన్సిలర్ పద్మా వీరారెడ్డి కుమారుడు బల్వంత్‌రెడ్డి ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతూ నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవులలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు, కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కలిసి కాంట్రాక్టర్ల పేర్లపై దొంగ నీటి బిల్లులు పెట్టుకొని డబ్బులు తింటుంటే ప్రశ్నించడను, బీజేపిని గ్రామంలో తిరుగులేని శక్తిగా మారుస్తుంటే తట్టుకోలేక, నాపై కక్ష పెంచుకున్న కాంగ్రెస్ నాయకులు పాపిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు నన్ను వ్యక్తిగతంగా గ్రామంలో బదునాం చేస్తున్నారని ఆరోపంచారు. మానసికంగా నన్ను నిత్యం హింసిస్తున్నారని వాపోయారు. రాజకీయంగా నా ఎదుగుదలను చూసి ఓర్వలేక నా అడ్డు తొలగించుకునేందుకే నాపై దాడి చేసి హత్యాయత్నం చేశారని, ఈ విషయంపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశానని బల్వంత్‌రెడ్డి వివరించారు. నా ఆఫీసులో మా ఇద్దరు స్నేహితులతో కూర్చొని ఉంటే రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఫుల్‌గా తాగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు నాపై బీర్ బాటిల్‌తో దాడి చేసేందుకు యత్నించారని, ప్రమాదాన్ని పసిగట్టిన నేను తప్పించుకొని అక్కడి నుంచి పారిపోయానని తెలిపారు. నేను పారిపోయాక నా కార్యాలయంపై పెట్రోలు పోసి నిప్పంటించారని, అందులోని రూ.20.లక్షల విలువైన ఒరిజినల్ డాక్యుమెంట్లు పూర్తిగా కాలి బూడిద అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడికి సంబంధించిన విజువల్స్ సీసీ కెమెరాలలో నిక్షిప్తమయ్యాయని తెలిపారు. ఇదే విషయంపై కాంగ్రెస్ నాయకుడు లంకల పాపిరెడ్డిని వివరణ అడిగితే బల్వంత్‌రెడ్డి వద్దకు వెళ్లిన మాట వాస్తవమే కానీ, దాడి చేయలేదన్నారు. ఇటీవల బల్వంత్‌రెడ్డి కుటుంబ పరంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని, అతడితో మాట్లాడి సరిచేయాలని వెళ్లానని, దీంతో ఆగ్రహంతో ఊగిపోయి నా స్నేహితుడి కారు అద్దాలు పగులగొట్టాడని వివరించాడు. నాపై నార్సింగి పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని, నేను కూడా బల్వంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశానని పాపిరెడ్డి తెలిపారు. ఇరువురూ ఒకరిపై మరొకరూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. గొడవ పడ్డ ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశామని మీడియాకు చెప్పుకున్నా, ఈ గొడవకు సంబంధించిన వివరాలను మీడియాకు చెప్పలేమని ఎస్.ఐ దాచే ప్రయత్నం చేయడం వెనుకాల ఆంతర్యం ఏమిటో ఆయనకే తెలియాలి.

# జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని నిరసన ప్రదర్శన

**సైఫాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సోమవారం జర్నలిస్టులు గళం విప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ళ స్థలాలు డిమాండ్ చేస్తూ 'డిమాండ్ డే'ను పాటించారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ (సమాచార భవన్) ఎదుట అనేక మంది జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడున్నర దశాబ్దాలుగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదని, హైదరాబాద్‌తోపాటు పలు నగరాలు, పట్టణాలలో జర్నలిస్టులు హౌసింగ్ సొసైటిలు ఏర్పాటు చేసుకున్న వాటి ద్వారా కూడా ఇళ్ళ స్థలాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. జర్నలిస్టులకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇవ్వకుండా సంవత్సరాలుగా జాప్యం చేసిందని ఇటీవల సుప్రీంకోర్టు జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వవచ్చునని తీర్పు ఇచ్చిందని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, హైదరాబాద్‌తోసహా అన్ని జిల్లాల్లో డబల్ బెడ్‌రూంలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ నాయకుడు పి.ఆనందం, నగర నాయకులు చంద్రశేఖర్, నిరంజన్, యాదగిరి, నాగవాణి, రఘు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశారు.



వినతి పత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

# దివ్యాంగులకు చట్టపరమైన అవగాహన అవసరం

## - సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్

**నాంపల్లి, అక్టోబరు 10, ప్రభాతవార్త :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి సూచనల మేరకు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్ సోమవారం 'ద హోమ్ ఫర్ డిసేబుల్డ్'ని సందర్శించి అక్కడి వారితో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, వసతులు అన్నీ సరిగ్గా ఉన్నాయా అని అడిగి తెలుసుకొని దివ్యాంగులకు చట్టపరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ మనిషికి శారీరక ఆరోగ్యం ఎంతముఖ్యమో అలాగే మానసిక ఆరోగ్యమూ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. దివ్యాంగులు ఉచిత న్యాయ సహాయం పొందడం వారి చట్టపరమైన హక్కు అని, ఎప్పుడు న్యాయపరమైన అవసరమొచ్చినా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాధిక జైశ్వాల్ సంస్థ కార్యదర్శి, సిబ్బందితో కలిసి హోమ్‌లో ఉన్న మెడికల్ క్లినిక్‌ని సందర్శించి అక్కడి డాక్టర్లతో మాట్లాడి అక్కడ వైద్యం పొందుతున్న వారి ఆరోగ్య వివరాలు తెలుసుకొని సమయానికి క్రమం తప్పకుండా డాక్టర్లు సూచించిన మందులను వేసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారిని కోరారు.



మాట్లాడుతున్న రాధిక జైశ్వాల్, హోమ్ సిబ్బంది



ఆర్.అర్జున్‌సింగ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

# నాంపల్లి నియోజకవర్గం మహజన్ సోషలిస్ట్ పార్టీ ఇన్‌ఛార్జిగా ఆర్.అర్జున్‌సింగ్ నియామకం

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** నాంపల్లి నియోజకవర్గం మహజన్ సోషలిస్ట్ పార్టీ ఆర్. అర్జున్‌సింగ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అర్జున్‌సింగ్‌ను గోషామహల్ నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ నాయకులు రవిమాదిగ, ఎస్.కె.శ్రీనివాస్ మాదిగ శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, గోవింద్‌లాల్, ఎస్‌కె.ప్రేమ్, ఎస్.కె.జగదీష్‌మాదిగ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ప్రచారానికి వెళ్లిన టిఆర్ఎస్ నాయకులు



ప్రచారం చేస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికల్లో భాగంగా సనత్‌నగర్ నియోజ కవర్గం, పద్మారావు నగర్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవా రం మునుగోడ ఉప ఎన్నికల ప్రచారానికి తరలివెళ్లి నియోజకవర్గంలోని నాంపల్లిలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి టిఆర్ఎస్ అభ్యర్ధిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

# ముస్లీం మహిళ పెళ్లికి ఆర్థిక సాయం

**షాద్‌నగర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 22 వార్డుకు చెందిన పెద ముస్లీం మహిళ వివాహానికి మాజీ కౌన్సిలర్ ఆలుగడ్డ పుష్పమ్మ, టీపీసీసీ సెక్రెటరీ ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్‌లు సోమవారం రూ.11వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ... కాలనీల్లో ఉండే మహిళల వివాహానికి ఆర్థికంగా ఇబ్బందు లు పడుతున్నారన్న సమాచారం తెలియడంతో తన వంతు సహాయంగా రూ.11వేల రూపాయలను అంద జేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను నివారించాలి

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** గోల్నాక డివిజన్‌లోని ఆలీకేఫ్ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ జిహెచ్‌ఎంసి అధికా రులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె జిహెచ్‌ఎంసి అధికారులు ఫరీద్, మనోహార్, ట్రాఫీక్ సిబ్బంది, స్థానిక బస్తీ కమిటి సభ్యులతో కలిసి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించడం జరిగింది. ఎక్కడెక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయాలో అధికారులతో ఆమె చర్చిండం జరిగింది. రెండు మూడు రోజుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే విధంగా చూడాలని ఆమె అధికారులను కోరారు. ఈ ప్రాంతంలో గతంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయని ఆమె విచారం వ్యక్తం చేశారు. ముందుచూపుతోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నివారించొచ్చని చెప్పారు.



అధికారులతో చర్చిస్తున్న లావణ్యశ్రీనివాస్‌గౌడ్

# సమస్యలు పరిష్కరించాలని హోంశాఖ మంత్రి మహమ్మూద్ అలీకి వినతి

**గోషామహల్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** గోషామహల్ నియోజకవర్గంలోని ప్రజలకు సమస్యలు ఎదురైన్న సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలంగాణ హోంశాఖ మంత్రి మహమ్మూద్ అలీకి గోషామహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ టిఆర్ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అందుకు భాద్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు హోం మినిష్టర్ మహమ్మూద్ అలీని కోరారు. అందుకు వారిపై విచారణ జరిపి తగ్గిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఫ్రెండ్లీపోలీసులు, కమ్యూనిటిపోలీసుగా వ్యవహరించాలని సూచించినప్పటికి ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. అత్యవసర సమయంలో ఎస్.హెచ్.ఓలు ఫోన్‌లు ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ వినతిపత్రం సమర్పించివారిలో జాంబాగ్ డివిజన్ టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.నందుకుమార్, మైనార్టీ అధ్యక్షులు అహ్మద్, సల్మాన్ పాల్గొన్నారు.



మహమ్మూద్ అలీకి వినతిపత్రం అందచేస్తున్న ఆనంద్‌గౌడ్

# రైతు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**షాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షులు దండు యాదవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్‌లో రైతులతో సమావేశం నిర్వహించి అనంతరం డిప్యూటి తహసీల్దార్ క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ....రైతుల రుణమాఫీ చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాల న్నారు. పంటలకు బీమా కల్పించాలన్నారు. వర్షాలకు పాడైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం రైతుల నుండి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. చెరుకు రైతుల సమస్యను పరిష్కరించాలన్నారు. జీవో 69ని అమలుపర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు చంద్రబాబు, వీరేశం, రామస్వామి, జగదీష్, అంజయ్య, రాములు తదితరులు ఉన్నారు.



గుంతలను పరిశీలిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

# రోడ్లను తక్షణమే బాగుచేయాలి

## - కార్పొరేటర్ మహాలక్ష్మీ

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాల వల్ల హిమాయత్ నగర్ డివిజన్‌లోని పలు రోడ్లు దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మత్తు చేయాలని స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అనేక రోడ్లతోపాటు మొయిన్ రోడ్డు కూడా దెబ్బతిన్నదని దీంతో పలు ప్రమాదాలు జరిగాయని ఆమె విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె జిహెచ్‌ఎంసి అధికారులు దివ్యా, శివతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి దెబ్బతిన్న రోడ్లను వారికి చూపించడం జరిగింది. తక్షణమే రోడ్లును బాగుచేయాలని ఆమె అధికారులను కోరారు.

# అర్హులైన వారికి పెన్షన్లు అందజేయాలి

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** నాంపల్లి మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు అర్హులైన వారికి అందచేయాలని జాంబాగ్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మీసాలక్రాంతి అన్నారు. సోమవారం నాంపల్లి మండల రెవెన్యూ అధికారి(తహసిల్దార్) ప్రసాద్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాంబాగ్ డివిజన్ పరిధిలోని వృద్దులకు, వితంతువులకు, ఒంటరిమహిళలు అర్హులైన వారికి ఫెన్షన్లు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అనిల్‌కుమార్, దళిత విభాగం అధ్యక్షులు దశరథ్, శివ, కాశీగౌతం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి తహాశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టిఆర్ఎస్ నాయకులు మీసాలక్రాంతి

# నాగటి నారాయణ మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు

## - తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

**ధర్నాచౌక్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** యుటీఎఫ్ నేత నాగటి నారాయణ ఆకస్మిక మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ఐక్యఉ పాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి అన్నా రు. సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిన నారాయణ భౌతిక కాయాన్ని దోమలగూడలోని టిఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సందర్శ నార్థం ఉంచారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, సీనియర్ నేతలు, మాజీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ కే.నాగేశ్వర్, గౌరీశంకర్, పాతూరి సుధాకర్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, పూల రవీం దర్, టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ కారం రవీందర్ రెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రిజర్వ్‌బ్యాంక్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషనన అధ్యక్ష కార్యదర్శు లు పి. కృష్ణమూర్తి, రంగయ్య, ప్రభాకర్‌నాయక్, ఇన్సూ రెన్స్ ఎంప్లాయీస్ యూని యన్ సీనియర్ నాయకులు వేణుగోపాల్, ఐలు నాయకులు, సీఐటియూ నా యకులు పాలడుగు భాస్కర్, నవతెలంగాణ ప్రభాకర్, రఘు, ఉపేందర్‌రెడ్డి, టిపిఎస్‌వి నాయకులు రాధేశ్యాం, పార్థసారధి తదితరులు నారాయణ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య, చావ రవి మాట్లాడుతూ యుటీఎఫ్ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలానికి పైగా యుటీఎఫ్ అధ్యక్షులుగా, ప్రధానకార్యదర్శిగా సేవలు అందించి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ తొలి ప్రధాన సంపాదకులుగా ఉన్న నారాయణ గారి మృతి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్‌తో పాటు ఇతర ప్రజా సంఘాలకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. నాగటి నారాయణ గారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నా మని అన్నారు.

# వాహనాల దొంగ రిమాండ్

**మేడ్చల్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** జల్సాలకు అలవాటు పడిన యువకులు వాహనాలదొంగతనం చేస్తూ పోలీసులకు పట్టిబడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీం ద్ర ఆదేశాల మేరకు మేడ్చల్ పోలీసులు చాకచక్యంగా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లోఏసీపీ రామలింగరాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లాలోని రాంనగర్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన ఐదుగురుయువకులు జల్సాలకు అలవాటు పడి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. అందులో మహమ్మద్ ఇమ్రాన్ (18),సుమేర్ అహమ్మద్ ఖాన్ (20), షేఖ్ షరాజ్ అలీ (19), సల్మాన్ (26), అద్నాన్ (16)లుతమ నివాసానికి దూరంగా ఉండే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను దొంగలించి నిర్మల్‌ప్రాంతానికి చెందిన గాయల్ బాబాకు రూ. 10 వేల నుంచి రూ 15 వేలకు ఒక్కో వాహనాన్నిఅమ్మి వచ్చిన డబ్బులను అందరూ సమానం గా పంచుకుని జల్సాలు చేసేవారు. వీరుదొంగతనాలు ఎవరికి తెలియకుండా చేస్తూ పోలీసులకు సవాల్‌గా మారారు. ఈ క్రమంలో గత సెప్టెంబర్ నెల 30న రాత్రి సమయంలో మేడ్చల్‌లో ఒక పల్సర్, కేటీఎం బైక్‌లను దొంగలించారు. ఈ కేసును నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ పుటేజి ఆధారంగా చాకచక్యంతో దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు బజాజ్ పల్సర్ బైక్‌లు, కేటీఎం డ్యూక్, హోండా ఆక్టీవ్ వాహనాలను స్వాదీనంచేసుకున్నారు. ఐదుగురు దొంగలో అద్నాన్ అనే నిందితుడుతో పాటు వాహనాలు కొనుగోలు చేసే గాయల్‌బాబా పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐరాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

# తెలంగాణ కొరియా సాంస్కృతిక వారధిగా తెలంగాణ విద్యార్థిని రమ్యకృష్ణ

## - డా. మామిడి హరికృష్ణ

**రవీంద్రభారతి, అక్టోబరు 10, ప్రభాతవార్త :** గత 10ఏళ్లుగా తెలంగాణ దక్షిణ కొరియాల మధ్య భాష, సంస్కృతి, సంగీతం, సినిమా తదితర అంశాలలో పరస్పర అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన 22 ఏళ్ల రమ్యకృష్ణ గోవర్ధన్ చిన్న వయస్సులోనే తూర్పు ఆసియా-కొరియన్ భాష, సాహిత్య, చరిత్రపై పరిశోధన కొనసాగించడానికి అమెరికాలోని 6 విశ్వవిద్యాలయాల నుండి స్కాలర్‌షిప్‌లు పొందిన తొలి భారతీయ విద్యార్థినిగా తెలంగాణ రాష్ట్రానికేకాక యావత్ తెలుగుజాతికే గర్వకారణంగా నిలిచిందని తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. 11ఏళ్లలోనే కొరియన్ భాషను నేర్చుకొని చదవడం, వ్రాయడం, మాట్లాడడంలో ప్రావీణ్యత సంపాదించి 13ఏళ్ల వయస్సులో హైదరాబాద్ కేంద్రంగా హైదరాబాద్ కెపాపర్స్ పేరుతో తొలి తెలంగాణ-భారతదేశ-కొరియా సాంస్కృతిక సంస్థను స్థాపించి సంస్కృతిని ప్రోత్సహించడానికి విశేషకృషి చేసిందని తెలిపారు. తూర్పు ఆసియా, కొరియన్ భాష, సాహిత్య, చరిత్రపై పరిశోధన కొనసాగించడానికి ఒహాయో రాష్ట్రం కొలంబస్‌లోని 'ది ఒహాయో స్టేట్ యూనివర్సిటీ' ఎంచుకున్న సందర్భంగా రమ్యకృష్ణ మామిడి హరికృష్ణను రవీంద్రభారతి ప్రాంగణం కళాభారతిలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఆమెను ఘనంగా సత్కరించి తెలంగాణ కొరియా సంస్కృతుల అభివృద్ధికి ఒహాయోలో కూడా కృషిచేసి వృద్ధిలోకి రావాలని కోరుతూ శుభాశీస్సులు అందించారు. ఈ సందర్భంగా రమ్యకృష్ణ ఇలాంటి అరుదైన అవకాశాన్ని సాధించిన తొలిభారత-తెలంగాణ అమ్మాయి కావడం ఆనందంగా ఉందని, తెలంగాణ-భారతదేశ-కొరియాల మధ్య సాంస్కృతిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పరిశోధన తనకు చాలా ఉపయోగపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 10, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, ధరఖాస్తులను వచ్చిన వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించటానికి చర్యలు తీసుకోవటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, జాన్‌శ్యాంసన్‌లు పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లా ప్రజల నుంచి 32 ధరఖాస్తులు, వినతులు, ఫిర్యాదులు అందినట్లు వివరించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, జాన్‌శ్యాంసన్‌లు పేర్కొంటూ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వాటిని పరిష్కరించటానికి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. వినతులు,ధరఖాస్తులు,ఫిర్యాదులపై పెండింగ్‌లో పెట్టకుండ వెంటనే త్వరగా పరిష్కరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఇబ్బందులు తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ లింగ్యానాయక్, పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

**షాద్‌నగర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త :** గత నెల సోలీపూర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడటం చాలా బాధకరమైన విషయమైని, వారిని కన్న తల్లిదండ్రుల కడుపు కోత తీర్చలేనిదని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోలీపూర్ ఘటనలో మృతి చెందిన చిన్నారులు అక్షిత్‌గౌడ్, ఫరీద్, సాహెబ్‌ల కుటుంబ సభ్యులను సోమవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కన్న కడుపు కోతను ఎవరు తీర్చలేరని, ఎంతో ఘోరం జరిగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే సాయన్న



2వ వార్డు రసూల్‌పురాలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. సోమవారం 2వ వార్డు రసూల్‌పురా క్రిష్ణానగర్ కట్టమైసమ్మ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 40 లక్షల వ్యయంతో సిడిపి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టం జరిగిందన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు నివేదిత, దేవులపల్లి శ్రీను, అంజనేయులు, కుమార్ ముదిరాజ్, శ్యామ్‌రెడ్డి, దేవరాజ్, జిలానీ, నర్సింహ్మా, ప్రకాశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించడంలో టిఆర్ఎస్ విఫలం



కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న బిజేపి నాయకులు

నిజాంపేట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రజలకు కనీస వసతులు కల్పించలేని స్థితిలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని నిజాంపేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు ఆకుల సతీష్ మండిపడ్డాడు. బిజెపి నాయకులు సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు సమస్యలపై పాదయాత్ర నిర్వహించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు మౌళిక వసతులు కల్పించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ టీఆర్ఎస్ ప్రభుత్వం మౌళిక వసతులు కల్పించేందుకు కోట్ల రూపాయలు నిధులను వెచ్చింస్తుందని ప్రగల్భాలు పలకడమే తప్పా అభి వృద్ధి చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో వరదనీటి సమస్య, ఎండా కాలంలో తాగునీటి సమస్య, చలి కాలంలో పారిశుధ్య సమస్య ఇలా చెప్పుకుంటూ పొతే రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలతో నిజాంపేట్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడమే కాకుండా గుంతలు పడిన రోడ్లకు మరమ్మత్తులు చేయకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డాడు. ఇప్పటికైనా అధికార ప్రజా ప్రతినిధులు ప్రగల్భాలు పలకడం మానేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు చంద్రమౌళి, కృష్ణ, సుహాసిని, అరుణ్‌రావు, ప్రసాద్ చౌదరి, అశోక్ నాయక్, ఈశ్వర్‌రెడ్డి, వెరెల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

## మానవ సంబంధాలను మెరుగుపరిచే అలైబలై



పిఆర్‌నగర్‌లో మహిళల అలైబలై కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి నాయకురాలు సద్గుణ రెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 10, ప్రభాతవార్త : ప్రస్తుత బిజీ ప్రపంచంలో మానవ సంబంధాలను మెరుగు పరిచే విధంగా అలైబలై కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందని రాష్ట్ర బిజెపి మహిళా నాయకురాలు సద్గుణ రెడ్డి అన్నారు. మోతీనగర్ ప్రాంతంలోని పాండురంగా నగర్‌లో సినియర్ బిజెపి నాయకురాలు శోభారాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అలైబలై కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలైబలై కార్యక్రమాన్ని మగవారే కాకుండా మహిళలు కూడా చేయవచ్చని నిరూపించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని పుష్ప గుచ్చాలు అందజేసి శాలువలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, కార్పొరేటర్ మహేందర్, పిట్ల మనోహర్, నాయకులు, నాగరాజు, ఏర్రస్వామి, కిలారి మనోహర్, గూడురి శ్రీధర్‌రెడ్డి, విజయభవాని, మల్లేష్, గాయత్రిదేవి, ఇందిరాజ జ్యోతి, మాదవిరాణి, ప్రత్యూష, బాలమణి, అన్నపూర్ణ, ఎన్ అంజిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ ఎస్.నంద

చిక్కడపల్లి, అక్టోబరు 10 ప్రభాత వార్త: రోటరీ క్లబ్ స్మార్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.నంద ప్రారంభించి ప్రసంగించారు. ఎంఎన్‌జె క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్‌లను గుర్తించేందుకు తీసుకుంటున్న చర్యలను మహవీర్ హాస్పిటల్, రీసర్చ్ సెంటర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎన్‌జె క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జయలత ఆదేశాల మేరకు వైద్యులు ఇక్కడికి వచ్చి పరీక్షలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'స్క్రీనింగ్ బస్' ద్వారా మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, గర్భాశయ పాప్ స్మెర్స్, నోటి క్యాన్సర్‌లను గుర్తించడానికి ఓరల్ అల్ట్రాసౌండ్ పరీక్షలను నిర్వహించారు. మహవీర్ ఆసుపత్రికి చెందిన గైనకాలజిస్టులు మహిళలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి, డాక్టర్ సంధ్య, ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ శాసనకోట అవులప్ప, ససనకోట మాధవి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ఆసరా ఫించన్లు

### సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ



లబ్దిదారులకు ఆసరా పింఛన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 10 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్‌లు అందజేస్తామని సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు సీతాఫల్‌మండిలోకి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు ఆసరా పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ పింఛన్‌లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును జోడెద్ల లాగా సమర్థవంతంగా జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో కరాటెరాజు, జాకీర్, శైలేందర్,మహిళా నేతలు మణిమంజరి, సరోజ, లలిత, విజయలక్ష్మీలు పాల్గొన్నారు.

## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో రెడ్డిలకు ప్రాధాన్యత ఇవ్వండి



ఎస్సై కానిస్టేబుల్లో రెడ్డిలకు ప్రాధాన్యత ఇవ్వాలని వినతిపత్రం ఇస్తున్న శ్రీధర్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 10, ప్రభాతవార్త : ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాల్లో రెడ్డి సామాజిక వార్గనికి ప్రాధాన్యత ఇవ్వాలని రెడ్డి జాగృతి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఓసిలకు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ప్రభుత్వం అమలు చేయాలని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఈరెడ్డి దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



కుషాయిగూడ, అక్టోబర్ 10 ప్రభాతవార్త : రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తి నీ ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రజలు చల్లపల్లి మహాలక్ష్మి నగర్ సమీపంలో రోడ్డు దాటుతున్న సుమారు 55 సంవత్సరాల వ్యక్తిని ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స పొందుతూ ఈనెల తొమ్మిదిలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## పంక్చర్ షాపు ధ్వంసం

షాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త : గుర్తుతెలియని వ్యక్తులు పంక్చర్ షాపును ధ్వంసం చేసిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం చందన్‌వెల్లి గ్రామానికి చెందిన మహ్మద్ సలామ్ తన జీవనోపాధికి కోసం గ్రామ శివారులోని పంక్చర్‌షాప్ పెట్టుకుని జీవనం గడుపుతున్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు.

## ప్రతి ఒక్కరూ పెద్దలను గౌరవించాలి : ప్రభుత్వవిప్ గాంధీ



పెద్దలకు సన్మానం చేస్తున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 10, ప్రభాతవార్త : పెద్దలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో గల సీనియర్ సిటీజన్స్ సంఘాల సమాఖ్య కూకట్‌పల్లి చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పెద్దల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని వయో వృద్ధులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రపంచ పెద్దల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు సన్మానం అనే ఈ కార్యక్రమం పట్టుకోవడం చాలా అబినందనీయమని, ఇంటి పెద్ద దిక్కులు, ఎంతో అనుభవాలతో జీవితాలను గడిపిన వారు అని వారిని మనం గౌరవించుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. కుటుంబ కోసం అహర్నిశలు కష్టపడి పిల్లల బాగుకోసం తపించి వారి ఉన్నతి కోసం జీవితాంతం పాటుపడిన మహనీయులు అని, వారి జీవిత అనుభవాలు మనకు ఆదర్శమని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో పసిపిల్లల్లాగా చూసుకోవాలని, వారి ఆలన పాలన భారం కాకూడదని, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు వారి చివరి దశలో సేవలు చేస్తూ వారిని కంటికి రెప్పలా చూసుకోవలన్నారు. వృద్ధాశ్రమాల సంఖ్యను తగ్గించాలని వృద్ధులను పిల్లలు తమ ఇండ్లలోనే చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా సీనియర్ సిటీజన్స్ సంఘాల సమాఖ్య కూకట్‌పల్లి చాప్టర్ వారి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. వృద్ధులకు ప్రభుత్వవిప్ గాంధీ చేతుల మీదుగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ కాలనీ సెక్రటరీ నర్సయ్య, సీనియర్ సిటీజన్స్ సంఘాల సమాఖ్య కూకట్‌పల్లి చాప్టర్ అడ్వైజర్ పాండురంగారెడ్డి, అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు డి.కె.ప్రసాదరావు, ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.ఎస్.శర్మ, జాయింట్ సెక్రటరీ బసవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్రరావు, కోశాధికారి వేదమూర్తి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి



ఆనారోగ్యంతో సన్‌బ్రిడ్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డివిజన్ ఉపాధ్యక్షులు సంజీవ్ తల్లి మల్లమ్మను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 10, ప్రభాతవార్త : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న డివిజన్ ఉపాధ్యక్షులు ఆవుల సంజీవ తల్లి మల్లమ్మ సన్‌బ్రిడ్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను సోమవారం డివిజన్ కార్పొరేటర్ విషయం తెలుసుకుని ఆసుపత్రిలో మల్లమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గం బిసిసెల్ అధ్యక్షులు నాగుల సత్యం, రాజాచారి, జ్ఞానేశ్వర్, యోగిరాజు స్వామి, సంపత్‌పటేల్ పాల్గొన్నారు.

## నేడు గండిపేట్ పార్కును ప్రారంభించనున్న మంత్రి కెటిఆర్

### రామేశ్వరం నర్సిహ్మా

నార్సింగి, అక్టోబర్ 10 ప్రభాతవార్త : గండిపేట్ జలాశయం వద్ద హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ల్యాండ్ స్కేప్ పార్క్‌ను రాష్ట్ర ఐటీ అండ్ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా ఒక ప్రకనటలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ అనితారెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సురభీ వాణిదేవి, జనార్ధన్‌రెడ్డి, రాజు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గండిపేట్ మండలంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని నర్సిహ్మా సూచించారు.

## జాతీయ ఆహార భద్రతా చట్టం 2013పై సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 10, ప్రభాతవార్త : జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 పై రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమంలో భాగంగ సూచనలు,సలహాలు ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తెలంగాణ ఆహారభద్రత కమిషన్ కార్యాలయానికి ప్రతి ఒక్కరు తెలియజేయవచ్చని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె పేర్కొంటూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని సాధారణ పౌరులు, అధికారులు, కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఈ చట్టాన్ని అమలు పరుస్తున్న అధికారులు లబ్దిదారులు, ఇందులో తప్పకుండ పాల్గొనాలని కమిషన్ కోరుతున్నట్లు వివరించారు. ఆహార భద్రత,పౌష్టికాహారం, అంటే ఏమిటో దాని అవసరం ఏమిటో, ఇప్పటి వరకు ఈ అంశంపైన జరిగిన అధ్యయనాల గురించి, జాతీయ ఆహారభద్రత చట్టంపై ప్రజలకు, అధికారులకు, అవగాహన,దాని అమలుపట్ల తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య సూచికల్లో సంభవించిన మార్పుల గురించి అదే విధంగ చట్టం వల్ల కలిగే లాభాలు ఏమిటో, అవి ఎంత ముఖ్యమైనదో, ఎంత అవసరమైనవో, చట్టం యొక్క లబ్దిదారులు ఎవరు, వాళ్ల హక్కులు బాధ్యతలు ఏమిటి, వివిధ స్థాయిలలో ఆ చట్టాన్ని అమలు పరిచేది ఎవరు, ఆ ఏర్పాటు ఎలా ఉన్నాయో, ఉండాలో, తెలిపే విధంగ కార్యక్రమం ఉంటుందని ఆమె వివరించారు. వివరాలు వీటి అమలులో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలు, తదితర అంశాలతో పాటు 1000నుంచి 3000పదాలకు మించకుండ సమగ్ర నోట్స్ రూపంలో రాసి పిడిఎఫ్‌గా పంపాలని డిఇఒ తెలిపారు.

## శబరిమలకు పాదయాత్రగా వెళ్లిన అయ్యప్ప స్వాములు



కలియుగ ప్రత్యక్ష దైవమైన అయ్యప్ప స్వామి సన్నిధికి పాదయాత్రతో బయలుదేరిన క్యాతం జగదీశ్ యాదవ్ తదితరులు

నార్సింగి, అక్టోబర్ 10 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి సన్నిధికి గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు పాదయాత్రగా తరలి వెళ్లారు. గురుస్వామి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో 130 మంది అయ్యప్ప స్వాములు 38రోజుల పాటు నడుస్తూ శబరిమలకు చేరుకునేందుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాలధారులు చేసిన స్వామియే శరణం అయ్యప్ప నామ స్మరణంతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగి పోయింది. అనంతరం గురుస్వామి ముత్యంరెడ్డి మాట్లాడుతూ కఠినమైన నియమ, నిష్టలను పాటిస్తూ, అనుక్షణం అయ్యప్ప నామస్మరణం చేసుకుంటూ స్వాములంతా శబరిమలైకు కాలి నడకన వెళ్లడం శుభ పరిణామమన్నారు. కాలంతో సమానం గా పరుగులు పెడుతున్న నేటి కంప్యూటర్ యుగంలో సైతం ఐటీ ఉద్యోగులు, యువత పెద్ద ఎత్తున అయ్యప్ప మాలలు వేసి ఆధ్యాత్మికత వైపు ఆకర్షితులవుతుండడం సమాజానికి మేలు చేస్తుందన్నారు. నిత్యం భగవన్నామ స్మరణం చేస్తే సర్వ పాపాలు హరించుకుపోతాయని, మనుషులు పరిశుద్ధులవుతారన్నారు. దేహనికి ఆహారం ఎలాగో ఆత్మకు దైవనామ స్మరణం అలాంటిదన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఉండే వారికి రోగాలు సైతం దూరమవుతాయన్నారు. మనం ఏది సంపాదించినా, అనుభవించినా ఈ లోకంలోనివేనని, తిరిగి వెళ్లే సమయంలో ఏదీ మన వెంట రాదన్న సత్యంను మానవులంతా గుర్తుంచుకోవాలన్నారు. కేవలం మనం జీవించిన సమయంలో చేసిన పాప, పుణ్యాలు, దాన ధర్మాలే మనతో పాటు వస్తాయని వివరించారు. సాధ్యమైనంత వరకు సాటి వారికి సహాయం చేయాలని, కీడుమాత్రం చేయవద్దని సూచంచారు. మండల దీక్షలు మనలను సన్మార్గంలోకి తీసుకెళ్లేందుకు చాలా వరకు ఉపకరిస్తాయని, మేలు జరుగుతుండడం వల్లనే ఏటేటా అయ్యప్ప మాల దారుల సంఖ్య లక్షల్లో పెరుగుతుందని గురుస్వామి ముత్యంరెడ్డి వివరించారు. శబరిమలైకు పాదయాత్ర ద్వారా వెళ్లిన వారిలో బండ్లగూడ జాగీర్‌కు చెందిన క్యాతం జగదీష్ యాదవ్‌తో పాటు 130.మంది ఉన్నారు.

# బస్తీల్లో బెల్ట్‌షాపులు

### అర్ధరాత్రి వరకు ఎక్కువ ధరలకు అమ్మకాలు

### తెల్లవార్లు బస్తీరోడ్లపై తిష్ట వేస్తున్న మందుబాబులు

### చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

**ప్రధానంగా నిరుపేదలు ఉండే కాలనీల్లోనే ఈ అక్రమ బ్లాక్ అడ్డాలు అధికసంఖ్యలో వెలుస్తున్నాయి. సాయంత్రం అయ్యిందంటే మందుబాబులు పీకల దాక మద్యం సేవించి రోడ్లపై, గల్లీల్లో తూలుతూ వీరంగం సృష్టిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుని రాత్రి పూట ఇంటికి తిరిగి వచ్చే యువతులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. అధికారుల వెంటనే స్పందించి బెల్ట్‌షాపులై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**



హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త: మద్యం దుకాణాలు, బార్ అండ్‌రెస్టారెంట్లు నిర్ణీత వ్యవధిలో మూత పడినా.. ఏటిఎం పద్ధతిలో మద్యపాన ప్రియులకు అందుబాటులో మద్యం లభ్యమవుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు నిత్యం నిషాలో తూగుతున్నారు. ఎక్కడపడితే అక్కడ అందుబాటులో బెల్ట్‌షాపులు వెలుస్తుండటంతో విక్రయాల జోరు హోరందుకుంది. మామూళ్లకు అలవాటు పడిన అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అక్రమవ్యాపారం జోరుగా సాగుతుంది. ఎక్కడచూసినా ఏకాలనీకి వెళ్ళినా బ్లాక్ అడ్డాలే దర్శనమిస్తున్నాయి. ఈఅడ్డాలు మినీ బార్లను తలపింపజేస్తున్నాయి. అర్ధరాత్రి వరకు విక్రయాలు ..తెల్లవారేవరకు మందుబాబుల వీరంగాలు కొనసాగుతున్నాయని ఆయా కాలనీల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క స్థానికంగా ఉన్న ఆయా వైన్స్‌ల పరిధిలో విక్రయిస్తున్న బ్లాక్ అడ్డాల విక్రయదారులు మద్యం అడ్డాల కోసం పోటీపడం విశేషం. మద్యం అక్రమ విక్రయాలు బాహాటంగానే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కిరాణం దుకాణాలు, మిల్క్‌బూత్‌లు మద్యం అడ్డాలకు కేంద్రబిందువులుగా మారాయి. ఈ కేంద్రాల లోపల మద్యం ప్రియులకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు (తినుబండారాలు) కల్పించడంతో దినదినం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం బ్లాక్‌అడ్డాలను గమనిస్తే అది ఓ మినీ బార్‌లనే తలపింపజేస్తున్నాయి. ఈవిక్రయాలు ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు నిరవధికంగా కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు.దీంతో రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ఆదాయానికి భారీగా గండి పడుతుంది.

ఈమధ్యకాలంలో ఎల్‌బినగర్ ప్రాంతంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో ఇదివరకు ఉన్నబెల్ట్‌షాపుకు దగ్గరలో మరో బెల్ట్‌షాపును ఏర్పా టు చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనికి పోలీసులే వచ్చి ఇద్ద రికి సర్ధిచెప్పి ఒకరుఅమ్మే బ్రాండ్ మరొకరు అమ్మకూడదని చెప్పిమరీ సెటిల్‌చేసి వెళ్ళినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులే దగ్గరుండి బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తుండటంతో ఎవరికి ఫిర్యాదు చేయాలని వాపోతున్నారు. కేవలం ఎన్‌టిఆర్ నగర్ మాత్రమే కాకుండా నగరంలో ఉన్న పలు బస్తీల్లో ఇలాంటి దందే కొనసాగుతుంది.


## వార్త CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, FULWADIYA SACHIN KHEMCHAND, R/O.PLOT NO.36, DURGA NAGAR, ZIA GUDA, ASIFNAGAR, HYD, T.S. CHANGED MY NAME AS SACHIN FULWARIYA S/O.KHEMCHAND FULWARIYA. (Ro.No.2745341)

★ I, SYEDA NAILA, R/o. H.No. 8-1-523/98, Brindavan Cly, Tolichowki, Hyd, T.S. changed my Name as SYEDA NAILA MASOOD D/o.SYEDA ZAKULLAH MASOOD. (Ro.No.2745341)

★ I, Krishna Murti Gandikota S/o. Gandikota Narsimham, R/o.30-1615/72/101, Suryanagar Enclave, Safilguda, Krupa Complex, changed my Name as "KRISHNA MURTHY GANDIKOTA" (Ro.No.2745341)

**Change of Date of Birth**

★ I, Virender Singh Tanwar S/o Ajit Singh Tanwar, R/o. H.No.1-3-603, Kavadiguda, Sec'bad. Changed my Date of Birth from 29.04.1993 to 29.041994 in the School Records for Educational purpose. (Ro.No.6144122)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

సంక్షిప్త 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నిట్ నెం.51/EE/Divn-15/SBZ/GHMC/2022, తేది:10.10.2022 క్ర.సం.1 నిట్ సం. పైన పేర్కొన్నది. పని పేరు: సివిల్ పనులు 9 సం., అంచనా మొత్తం: 193.35 లక్షలు, బిడ్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.10.2022 ఉ.11.00 గం., డౌన్‌లోడ్ ముగింపు తేది: 14.10.2022 ఉ.11.00 గం., బిడ్ తెరుచుట: 14.10.2022 ఉ.11.15 గం. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ సం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-డివిజన్-15, GHMC, 9704456422. తదుపరి వివరాలు www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తరపున, డివిజన్ నం.15, GHMC
DIPR.No.7619-PP/CL/Advt/1/2022-23, తేది: 10.10.2022

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

నిట్ నెం.33, పని పేరు: రాజేంద్రనగర్ సర్కిల్-11, GHMC పరిధి యందు RMC తోపాటుగా CC రోడ్లు వేయుట మరియు కమ్యూనిటీ హాలు నిర్మాణము 06 నెం.ల పనులు; అంచనా విలువ ECV: రూ.76.43 లక్షలు; డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది మరియు సమయము: 11.10.2022న మ.2.30 గం.లు; బిడ్‌ల స్వీకరణకు చివరి తేది మరియు సమయము: 14.10.2022న మ.2.45 గం.లు; EE/SE పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, రాజేంద్రనగర్ డివిజన్ నెం.-11, GHMC, సెల్ నం.9989930608; ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్-XI (RJNR), GHMC
DIPR.No.7636-PP/CL/Advt/1/2022-23, తేది: 10.10.2022


### పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళనం

షాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త : షాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకుని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు.


IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE CUM ADDL METROPOLITAN MAGISTRATE: MEDCHAL MALKAJGIRI DIST : AT L.B.NAGAR
O.S.No. 189 OF 2022

Between:
1. Kothapalli Yogitha @ B. Yogitha Varma D/o late Kothapalli Brahmananda Swamy, W/o B. Sharath Chandra Sharma, Aged about 39 years, Occ: House wife, R/o Flat No.1-1-226/101, Balaji Nagar Colony, Road No.1, Mohan Nagar, Kothapet, Uppal Mandal, Medchal Malkajgiri District -500035. ...Plaintiff
And
1. The Tahsildar, Uppal Mandal Revenue Office, Uppal, Medchal- Malkajgiri District .
2. All concerned ...Defendants
To,
The All Concerned ...Respondent No.2
Please take the notice that the above cited Plaintiff herein have filed suit for Declaration to declare her as the legal heir of LATE KOTHAPALLI BRAHMANANDA SWAMY (died on 25-8-2017) who purchased the suit schedule property bearing No. Flat No. 209, H.No. 1-1-402/209, Prajay Nivas Apartments, Phase-II, Mohan Nagar, Kothapet, Ranga Reddy District, Telangana -500035 and same is posted on 26-10-2022 for receiving objections from all concerned including the Defendants , as such if anybody is having any objection, please attend before the Hon'ble Court on 26-10-2022 at 10-30 a.m. either in person or through your Advocate to file your objections in the matter if any failing which the matter will be decided as per the records available with the court.

SCHEDULE OF PROPERTY:
All that the part and parcel of flat bearing No.209 in 3rd floor of Block No.6th with a plinth area of 565 Sq.feet including common area of land bearing Survey No.121, 122, 123 and 124 in Prajay Nivas Apartments Phase-II, Mohan Nagar, Kothapet, Uppal Mandal which was registered vide document No. 8561/2004 before SRO Uppal, R.R. District and is bounded by: NORTH: Flat No. 210/VI, SOUTH: Flat No. 208/VI, EAST: Open to sky, WEST: Open to Sky and Corridor.
// By Order of the Hon'ble Court //
Sd/- Sri V. Jaya Pradha, Advocate,
Plot No.6/w, Road No.9, Balaji Nagar colony, Mohan Nagar, Kothapet, Ranga Reddy District.-35.

## ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బేతి, ఖాజామైనుద్దీన్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ముస్లిం,మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం తమవంతు కృషి చేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఉప్పల్ ఎక్‌మినార్ మసీదులో మసీదు కమిటి అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఖాజామైనుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతితోపాటు, మాజీ కార్పొరేటర్ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి, టిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఐలా అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని, ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే విలాద్ ఉన్ నబీ వేడుకలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటి అధ్యక్షుడు ఖాజామైనుద్దీన్, ఉపాధ్యక్షుడు డా.మగ్దూమ్ హుస్సేన్,కార్యదర్శి సయ్యద్ అలీ, కోశాధికారి మహ్మద్ అబ్దుల్ ఘని, మెంబర్లు మహ్మద్ జహంగీర్, సాబేర్‌పాషా, పారుఖ్‌షేక్, అబ్దుల్ గఫార్, గౌస్, రియాజ్ అన్సారీ, రహ్మాన్ పారుఖీ, పలువురు రాజకీయ పార్టీల నేతలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రవాణా రంగ సమస్యలపై కెటిఆర్‌తో చర్చ



మంత్రి కెటిఆర్‌ను కలిసిన లారీ యజమానుల సంఘం సభ్యులు

**వనస్థలిపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో లారీ యమానుల సంఘం గౌరవ అధ్యక్షులు మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రవాణా రంగం యొక్క సమస్యలను చర్చించారు. ఈ చర్చలో సింగిల్ పర్మిట్, రోడ్ టాక్సీ, ఓవర్ లోడ్, ప్రమాద సమయంలో డ్రైవర్ లైసెన్స్ 3 నెలల రద్దు, ఆర్టీఓ కేసుల్లో అప్పటి కప్పుడు పెనాల్టీ కట్టుకొని వాహనాన్ని విడుదల చేసుకోవడం, రవాణా రంగానికి సంబంధించిన అన్ని విషయాలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులను మాట్లాడి తక్షణమే పరిష్కారమయ్యే వాటినీ చూడాలని సిఎస్, టిఎస్ఎండిసి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నందరెడ్డి, ఉపాధ్యక్షులు సుర్వియాదయ్యగౌడ్, బుడి రాంరెడ్డి, జగదీష్ యాదవ్, నర్రి వెంకన్న, వెంకటేష్, ఉపెందర్‌గౌడ్, లింగన్నగౌడ్, లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారం : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



కార్మికులచే మరమ్మతులు చేపడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** బియన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ రోడ్ నెం. 6 ప్రవేశద్వారం వద్ద గుంతలు పడి నడవడం కూడా ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఇందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత కార్మికులతో మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఎటువంటి సమస్యలున్నా తనకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి సత్వర పరిష్కారం చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు మధుసుధన్‌గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, పవన్‌రెడ్డి కిషోర్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భగాయత్ కాలనీ వాసులకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని వినతి

**రామంతాపూర్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ పరిధిలోని కాలనీవాసులకు ఇంటి నెంబర్లు కేటాయించాని కోరుతూ పలువురు కాలనీవాసులు సోమవారం డిసి అరుణకుమారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు నరసింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాములు, మహేందర్, వెంకట్‌రెడ్డి, గడ్డం నరసింహా, విజయేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్ కాలనీలను గతంలో ఇంటి నెంబర్లు ఇస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. భగాయత్ కాలనీలను డినోటిపై చేసి వెంటనే ఇంటి నెంబర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.




# పొంగుతున్న డ్రైనేజీ - పట్టించుకోని అధికారులు

### వికాస్‌నగర్‌లో దుర్భర పరిస్థితి - అనారోగ్యం పాలవుతున్న ఉద్యోగులు, స్థానికులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత నెల రోజులుగా డ్రైనేజీ పొంగుతుండడంతో పలువురు అనారోగ్యంపాలై ఆస్పత్రిలో చేరుతున్నారు. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్న జలమండలి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్‌కాలనీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్డు పూర్తిగా డ్రైనేజీ లీకేజీ కారణంగా దుర్గంధంగా మారింది. గత నెల రోజులుగా ఈ రోడ్డు దుర్భరంగా మారినప్పటికీ జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ దారి గుండా ప్రయాణించే పాదాచార్యులు, ద్విచక్ర వాహనదారుల పరిస్థితి దయనీయంగా తయారయింది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డ్రైనేజీ పైప్‌లైన్‌వల్ల ఎప్పుడు సమస్యలు తలెత్తుతూనేఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే తరచు సమస్య తలెత్తుతుందన్నారు. డ్రైనేజీ లీకేజీ కారణంగా బ్యాంకులో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోమ రామనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా నరకయాతన అనుభవిస్తున్నామని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరు స్పందించడం లేదని వార్డు



యూనియన్ రోడ్డు వద్ద డ్రైనేజీ పొంగుతున్న దృశ్యం

సభ్యురాలు రత్నంపల్లి శోభారాణి అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలి సర్కిల్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా తమకు సంబంధం లేదన్నట్లుగా ఇరుశాఖల అధికారులు వ్యవహరిస్తున్నారని ఆమె తెలిపారు. ఇప్పటికైనా పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వెంటనే సమస్య పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## టిపిసిసి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ బిన్ హజబ్ టిఆర్ఎస్‌లో చేరిక



సబితారెడ్డి సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత సయ్యద్ బిన్ హజబ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్‌లో కాంగ్రెస్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సమద్ బిన్ సిద్దిఖీ పార్టీకి రాజీనామా చేసి టిఆర్ఎస్‌లో చేరి కనీసం నెల రోజులు గడువక ముందే మరో నేత కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి గులాబి గూటికి చేరారు. మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సయ్యద్ బిన్ హజబ్ కాంగ్రెస్‌ను వీడారు. ఈ మేరకు సోమవారం ఆయన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఖైసర్ బామ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో గులాబి తీర్థం పుచ్చుకున్నారు. తన వర్గీయులతో కలిసి మంత్రి వద్దకు తరలివెళ్ళిన ఆయనను సాదరంగా ఆహ్వానించిన సబితారెడ్డి గులాబి కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయనతో పాటు సుమారు యాభై మంది పార్టీలో చేరడంతో మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాజర్ బిన్ అవల్గీ, మిరాజ్ ఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, అహ్మద్, అబ్దుల్, ఫరీద్, సల్మా, వహీదా, బీబీ, ఫాతిమాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేద యువకుని వైద్య చికిత్సకు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు : మంత్రి సబితారెడ్డి



మంత్రి చేతుల మీదుగా చెక్కును తీసుకుంటున్న ప్రతాప్ కుటుంబ సభ్యులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ పేద యువకుని వైద్య చికిత్సకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆపన్న హస్తం అందించారు. నాదర్‌గుల్‌కు చెందిన ప్రతాప్ అస్వస్థకు గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించిన కుటుంబ సభ్యులు వైద్య ఖర్చులు భరించలేక మాజీ కౌన్సిలర్ ఇంద్రపల్లి యాదగిరిని ఆశ్రయించడంతో ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సూచనల మేరకు సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆమె సిఫారసుతో ప్రతాప్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.45 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంత్రి చేతుల మీదుగా ప్రతాప్ కుటుంబ సభ్యులు చెక్కు తీసుకున్నారు. కార్యక్రమంలో జంగయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీవాణి



రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణికి వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

**రామంతాపూర్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్ సాయికృష్ణకాలనీ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పలువురు కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. సాయికృష్ణకాలనీలో డ్రైనేజీ లేక ఇబ్బందులు వస్తున్నాయని, కొత్త డ్రైనేజీ లైన్లు వేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో కాలనీ సమస్యలను చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పర్యావరణ పోటీలో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని పర్యావరణ పరిరక్షణ–శిక్షణా పరిశోధన సంస్థ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా గత సెప్టెంబర్ 16న ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలలో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అనురాగ్ పాండే ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతికి ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జ్యోత్స్నప్రభ తెలియజేశారు. పాండేకు త్వరలో బహుమతి ప్రదానం చేయబడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పాండేను పోటీలకు సిద్ధం చేసిన కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు డా.డి.వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## జేఎన్ఎన్‌యుఆర్ఎం గృహాల అనధికార ఖాళీ డ్రా పద్ధతి ద్వారా ప్లాట్ల కేటాయింపు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ మండల రెవెన్యూ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లో ఉన్న జేఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలలో అనధికారికంగా ఉన్న 425 నివాసితులను ఖాళీ చేయించి వారికి రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని సరూర్‌నగర్ తహసిల్దార్ జయశ్రీ ప్రకటన విడుదల చేశారు. 425మంది నివాసితులకు అక్టోబర్ 12 తేదీన ఉదయం 10లకు కర్మన్‌ఘాట్‌లోని వంగా అనంతరెడ్డి ఫంక్షన్‌హాల్ డ్రా పద్ధతి ద్వారా ప్లాట్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను, కర్మన్‌ఘాట్ జేఎన్ఎన్‌యుఆర్ఎంలోని 425 మంది అనధికార నివాసితులు డ్రా కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ



హోంమంత్రిని కలిసిన లాయఖ్ అలీ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ఉత్సవాలను ప్రశాంత వాతవారణంలో శాంతియుతంగా జరుపుకోవాలని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని లాయఖ్ అలీ తదితర నాయకులు హోంమంత్రి, మలక్‌పేట నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీలను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఆటంకం కలిగించిన లాండ్ మార్క్ హోటల్ నిర్వహకులపై కేసు నమోదు



రామంతాపూర్ ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్ నిలిపివేసిన హోటల్ నిర్వహకులు దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్ ప్రధాన రహదారిలో హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాఫిక్ అటంకం కలిగించిన హోటల్ యాజమాన్యంపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ సిఐ పార్థసారధి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి లాండ్ మార్క్ హోటల్ నిర్వహకులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా సినీ నటితో హోటల్ ప్రారంభించారు. దీంతోపాటు ప్రధాన రహదారిపై డిజె ఏర్పాటు చేసి పెద్ద శబ్దాలతో మైక్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 5 కి.మీ వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారని సిఐ పార్థసారధి తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుడా కనీసం సమాచారం ఇవ్వకుండా, సామాజిక బాధ్యత లేకుండా నిర్వహకులు వ్యవహరించారని ఆయన తెలిపారు. హోటల్‌కు పార్కింగ్ సదుపాయం లేదని, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు సుమారు గంటల సమయం పట్టిందని తెలిపారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఉప్పల్ ఫిస్తా హౌజ్ వద్ద కూడా సరైన పార్కింగ్ సదుపాయం లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీటి అనుమతులు రద్దు చేయాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తరుణ్‌చుగ్‌ను కలిసిన లింగాల హరిగౌడ్



తరుణ్‌చుగ్‌ను కలిసిన హరిగౌడ్ తదితరులు

**సైదాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** బిజెపి తెలంగాణా ఇంఛార్జి తరుణ్ చుగ్, బిజెపి జాతీయ నాయకులు డాక్టర్ లక్ష్మణ్‌లను మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన లింగాల హరిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం హరిగౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లింగాల హరిగౌడ్ ఇటీవలే బిజెపిలో చేరారు.

## నేరాల అదుపులో సిసి కెమెరాలదే ముఖ్య పాత్ర : ఎమ్మెల్యే మంచిరెడ్డి



సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి, సీపీ భగవత్

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో 30లక్షల రూపాయల విలువ చేసే 50సిసి కెమెరాలను కళ్లెం బల్ రెడ్డి గార్డెన్స్‌లో రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్‌తో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈకెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మానిటర్ చేస్తారని, వీటిని ఏర్పాటుచేయడం ప్రజలకు లాభదాయకమని. నేరాలను అదుపు చేయడం, అసాంఘిక శక్తుల అరాచకాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు ముందుకు రావాలని కోరారు. కాలనీల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సన్ ప్రీత్ సింగ్, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, టీఎస్ఎస్ఐఐసి జోనల్ మేనేజర్ రవి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు భరోసా ఆసరా పెన్షన్లు : ఎమ్మెల్యే బేతి



పెన్షన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ పన్నాల

**నాచారం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాలకు భద్రతను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన సుమారు వంద మందికి ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బేతి కార్డుల పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశంలోఎక్కడ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమీషనర్ శంకర్, అధికారులు వెంకటేష్, జోమని, ఊర్మిల, పల్ల కిరణ్ కుమార్‌రెడ్డి, కుంటి కృష్ణ, వాసుగౌడ్, వైళ్ల ప్రవీణ్, రంగు ప్రసాద్ గౌడ్, అల్లాడి కృష్ణ యాదవ్, బుసాని రఘు, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సిఎం సహాయనిధి : బలాల



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, అక్టోబరు 10 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 5 లక్షల 32 వేల 500 విలువగల చెక్కులను 16 మంది లబ్దిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధిద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## అర్హులైన వారికి పెన్షన్ కార్డులను పంపిణీ



పెన్షన్ కార్డులను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ అనురాధ, ఐలయ్య

**తుర్కయంజాల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 18వ వార్డ్ కమ్మగుడ వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ కాకుమాను సునీల్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్‌తో కలిసి పెన్షన్ కార్డులను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు అదే విధంగా కమ్మగూడ 22వ వార్డు పరిధిలో అర్హులైన వారికి పెన్షన్ కార్డులను కౌన్సిల్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మంజుల కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు : గీత



పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ప్రభుత్వం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం వార్డు కార్యాలయంలో శానిటేషన్ డిఇ చందన, శానిటరీ సూపర్‌వైజర్ కె.సుదర్శన్‌లతో కలిసి పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ కిట్లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు విధులలో ఉన్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, మాస శేఖర్ తదితరులు పాల్గొన్నారు.